సాక్షి
నల్లగొండ
మంగళవారం । 3 । జనవరి । 2023

గరిష్టం/కనిష్టం
30.0°/18.0°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది.
రాత్రిపూట చలి మోస్తరుగా ఉంటుంది.

● వైకుంఠ వైభవం



వైకుంఠ ఏకాదశి సందర్భంగా నల్లగొండలోని రామాలయంలో ఉత్తరద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు, (ఇన్‌సెట్‌లో) స్వామివారు



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, పక్కన అదనపు కలెక్టర్లు

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వేడుకలు

నల్లగొండ : కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులుతో కలిసి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, భాస్కర్‌రావు కలెక్టర్‌కు మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారివెంట వివిధ శాఖ ఉద్యోగులు, పలు సంఘాల నాయకులు ఉన్నారు.

న్యూస్‌రీల్

నేడు మంత్రి హరీష్‌రావు రాక

నల్లగొండ : రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు మంగళవారం జిల్లాకు రానున్నారు. విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలిసి మర్రిగూడ మండల కేంద్రంలో నిర్మించిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ నూతన భవనాన్ని ప్రారంభించనున్నారు. యాదాద్రి జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

టీజీఓస్ క్యాలెండర్ ఆవిష్కరణ



టీజీఓస్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నల్లగొండ : తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీఓస్) 2023 క్యాలెండర్‌ను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు భాస్కర్‌రావు, ఖుష్బూ గుప్తా, సంఘం జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌లు, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, కోశాధికారి యాకూబ్, అమరేందర్‌గౌడ్, పి.శ్రీనివాస్, సురేష్, మంగ్యానాయక్, వెంకటేశ్వర్‌రావు, జాకీర్ అలీ, అక్తర్, ఫర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి సంక్రాంతి సెలవులు

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీకి ఈనెల 8 నుంచి 16వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్లు రిజిస్ట్రార్ కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ అనుబంధ కాలేజీలకు కూడా సెలవులు వర్తిస్థాయని పేర్కొన్నారు. పరిపాలనా విభాగం, పరీక్షలు, ఇతర విభాగాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

పాఠశాలల్లో పనులు 15లోగా పూర్తిచేయాలి



పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

నకిరేకల్ : 'మన ఊరు -మన బడి' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పాఠశాల అభివృద్ధి పనులను ఈనెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని డీఈఓ భిక్షపతి సూచించారు. నకిరేకల్ బాలికల ప్రాథమిక పాఠశాల, నోముల ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈ పనుల పూర్తి విషయంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్లు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. ఆయనవెంట ఎంఈఓ నాగయ్య, హెచ్ఎంలు వీరయ్య, కొండలక్ష్మి ఉన్నారు.

గ్రూప్-4 పరీక్షకు ఉచిత శిక్షణ

రామగిరి(నల్లగొండ) : బీసీ స్టడీ సర్కిల్ నల్లగొండలో గ్రూప్-4 పరీక్షకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు స్టడీ సర్కిల్ సంచాలకుడు కె.విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు జనవరి 3 నుంచి 10వ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

జాండ్ర మఠం పునరుద్ధరణకు కృషి



జాండ్ర మఠాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

ఆలేరురూరల్ : మండలంలోని కొలనుపాకలో వైటీడీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న సోమేశ్వరాలయం పునరుద్ధరణ పనులను సోమవారం పురావస్తు పరిశోధకులు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా జాండ్ర మఠాన్ని ఆయన సందర్శించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 18 మఠాలు కొలనుపాకలో ఉన్నాయన్నారు. ఇందులో తొమ్మిదవ శతాబ్దం నాటి జాండ్ర మఠాన్ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఆలయ అర్చకులు సోమయ్యస్వామి, గంగాధర్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

అంధుల పాఠశాల కొన్ని రోజులే..

వచ్చే విద్యా సంవత్సరం నుంచి మూసివేత

- కేంద్రం చట్ట సవరణతో తగ్గిన విద్యార్థుల సంఖ్య
- సమయానికి అందని ప్రభుత్వ సాయం
- పాఠశాల నిర్వహణ భారంగా మారడంతో మూసివేత నిర్ణయం

రేపు ప్రపంచ బ్రెయిలీ డే..



అంధుల పాఠశాల భవనం

నల్లగొండ టూటౌన్ : ఉమ్మడి జిల్లాలో ఉన్న ఏకైక అంధుల పాఠశాల మూసివేతకు సిద్ధమవుతోంది. ఎంతో మంది అంధ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారు ఉన్నత స్థానంలో ఉండేలా కృషి చేసిన ఈ పాఠశాలకు ఇక ఆఖరి రోజులనే చెప్పాలి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్ట సవరణతో పాఠశాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు పాఠశాలకు ప్రభుత్వాలు ఇచ్చే నిధులు సమయానికి రాకపోవడం, విద్యార్థుల సంఖ్య ఇటీవల కాలంలో గణనీయంగా తగ్గడంతో నిర్వహణ భారం పెరిగిపోయిందని నిర్వాహకులు చెబుతున్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రస్తుతం 50 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. దీంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ అంధుల పాఠశాలను మూసివేయాలని నిర్ణయించారు. ఈ నెల 4న ప్రపంచ బ్రెయిలీ డే సందర్భంగా ఈ పాఠశాలపై ప్రత్యేక కథనం.

2000-01 విద్యా సంవత్సరంలో ప్రారంభం

నల్లగొండ పట్టణంలోని గొల్లగూడలో డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ (డ్వాబ్) సంస్థ 1996లో అంధుల హాస్టల్‌ను ఏర్పాటు చేసి డైట్‌లో చదువుకునే అంధులకు వసతి కల్పించింది. తర్వాత అంధ విద్యార్థులకు ప్రత్యేక పాఠశాల ఉండాలనే సంకల్పంతో జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు (ప్రస్తుతం రిటైర్డ్) పానుగోటి చొక్కారావు 2000-01 సంవత్సరంలో అంధుల పాఠశాలను స్థాపించారు. దాతల సహకారంతో పాఠశాలను నడిపించి విద్యార్థులకు అలనా, పాలనతో పాటు వారి ఉన్నత విద్యను సైతం ప్రోత్సహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఖమ్మం, నెల్లూరు, వరంగల్, కరీంనగర్, గుంటూరు, మహబూబ్‌నగర్, నల్లగొండ ఉమ్మడి జిల్లాలకు చెందిన అంధ విద్యార్థులు కూడా ఇక్కడ విద్యనభ్యసించారు. ఇప్పటి వరకు 500 మందికి పైగా ఇక్కడ చదువుకోగా.. 100 మందికి పైగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు సాధించి స్థిరపడ్డారు. ఇంతటి ప్రభ ఉన్న అంధుల పాఠశాల ఇక వచ్చే విద్యా సంవత్సరం నుంచి బంద్ కానుంది.

పాఠశాలకు రాష్ట్రపతి అవార్డు..

22 సవత్సరాల నుంచి కొనసాగుతున్న అంధుల పాఠశాలను అనేక మంది ప్రముఖులు సందర్శించారు. ప్రస్తుత, మాజీ గవర్నర్‌లు డాక్టర్ సి.రంగరాజన్, సీహెచ్.విద్యాసాగర్ రావు, సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రులుగా పని చేసిన సత్యనారాయణ సంప్లా, సినీ నటుడు చిరంజీవి, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌లు, ఎస్పీలు సందర్శించిన వారిలో ఉన్నారు. ఈ పాఠశాల విద్యార్థులు 2017లో ప్రధానమంత్రి నరేంద్రమోదీని, నాటి రాష్ట్రపతి రాంనాథ్ కోవిద్‌ను కలిశారు. 2001లో ఈ పాఠశాల భారత రాష్ట్రపతి అవార్డు, ఉత్తమ పురస్కారం అందుకుంది. 2017లో రాష్ట్ర ప్రభుత్వం రోల్‌మోడల్ అవార్డు ఇచ్చి సత్కరించింది. రెండు దశాబ్దాల పాటు అంధులకు వసతితో కూడిన విద్య అందించిన పాఠశాలకు ఇక ఫుల్‌స్టాప్ పడనుంది.

చట్ట సవరణతో తగ్గుతున్న విద్యార్థులు..

అంధ విద్యార్థులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఒక చట్టం తీసుకొచ్చింది. దాని ప్రకారం ఒకటి నుంచి 15 మందిలోపు పిల్లలు ఉన్న పాఠశాలలో ఓ ప్రత్యేక టీచర్‌ను నియమించుకోవాల్సి ఉంటుంది. 15 మంది దాటితే ఇద్దరు టీచర్లను నియమించుకోవాలి. ఆ టీచర్లు నాలుగు కిలోమీటర్ల పరిధిలో ఉన్న పాఠశాలలు తిరుగుతూ విద్యాబోధన చేయాలని నిబంధనలు పెటింది. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌లో కూడా అంధ విద్యార్థులను చేర్చుకోవచ్చని చెప్పింది. దీంతో ద్వారా చాలా మంది ఆయా పాఠశాలల్లో చేరుతున్నారు. అయితే ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ద్వారా ఒకే తరగతి గదిలో సకలాంగ విద్యార్థులతో సమానంగా అంధులకు ఏ మేర విద్యనందిస్తారనే దానిపై బిన్నభిప్రాయాలు ఉన్నాయి. ఈ విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠశాల లేకపోవడం వారికి తీరని నష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

350 మంది అంధ విద్యార్థులు

జిల్లాలో 350 మందికి పైగా అంధ విద్యార్థులు ఉన్నట్లు సర్వే ద్వారా తేలింది. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఆసరా పింఛన్ పొందుతున్న అంధులు ఎక్కువ మంది పాఠశాలల్లో చేరడం లేదనే వాదనలు కూడా ఉన్నాయి. పింఛన్ తీసుకుంటున్న అంధ విద్యార్థులను అంధుల పాఠశాలలో చేర్పించాలని డ్వాబ్ సంస్థ నిర్వాహకులు కలెక్టర్‌తో పాటు విద్యాశాఖకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు.

విద్యార్థులు రాకనే మూసివేత



"అంధ విద్యార్థులకు సంబంధించి ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు కాగితాలు దాటి బయటికి రావడంలేదు. చట్ట సవరణతో విద్యార్థులు ఎక్కడైనా చదువుకునే వీలు కల్పించింది. పింఛన్ తీసుకుంటున్న విద్యార్థులు కూడా బడికి రావడంలేదు. విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గిపోవడంతో మూసివేయాలని నిర్ణయం తీసుకున్నాం.

– పానుగోటి చొక్కారావు, డ్వాబ్ సంస్థ ప్రధాన కార్యదర్శి



పాఠశాలను ప్రారంభిస్తున్న అప్పటి గవర్నర్ రంగరాజన్, ఎలిమినేటి ఉమామాధవరెడ్డి (ఫైల్)



విద్యార్థులతో కలిసి ప్రధాని మోదీని కలిసిన పానుగోటి చొక్కారావు (ఫైల్)



ఉద్యమ సమయంలో అంధుల పాఠశాలకు వచ్చిన కేసీఆర్‌కు జ్ఞాపిక ఇస్తున్న చొక్కారావు (ఫైల్

పంట రుణాల ఖాతాలు హోల్డ్

- మునుగోడు ఏపీజీవీబీలో రైతులకు అందని రైతుబంధు
- రుణాలు రెన్యూవల్ చేసుకోవాలంటున్న మేనేజర్
- పంట పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్న రైతులు



మునుగోడులోని ఏపీజీవీబీ

మునుగోడు : ప్రభుత్వం జమ చేసిన రైతుబంధు డబ్బులు రైతులకు అందడం లేదు. ప్రభుత్వం ఓవైపు బ్యాంకు రుణాలతో సంబంధం లేకుండా రైతుబంధు డబ్బులను రైతులకు ఇవ్వాలని చెబుతున్నా మునుగోడులో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ) అధికారులు దాన్ని అమలు చేయడం లేదు. రుణాల ఖాతాల్లో పడిన రైతుబంధు డబ్బులు తీసుకునే వీలు లేకుండా ఖాతాలను హోల్డ్‌లో పెట్టారు. ఏళ్ల తరబడి అప్పులు చెల్లించకపోవడంతో వారి ఖాతాలు ఆటోమెటిక్‌గా హోల్డ్‌లోకి వెళ్తాయని, గతంలో తీసుకున్న అప్పుకు వడ్డీ చెల్లించి రుణం రెన్యూవల్ చేసుకుంటే తప్ప తాము రైతుబంధు నగదు ఇవ్వలేమని మునుగోడులోని ఏపీజీవీబీ మేనేజర్ బాహాటంగా చెబుతున్నారు. అయితే రైతులు మాత్రం ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ప్రకటించినందునే తాము రుణాలు చెల్లించలేదని అంటున్నారు. బ్యాంకు అధికారులు కావాలనే డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపిస్తున్నారు.

మునుగోడు ఏపీజీవీబీలో మాత్రమే...

మునుగోడు మండలంలో 26 గ్రామాల్లో 49,920 ఎకరాల్లో 18,474 మంది రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. వారికి వానాకాలం, యాసంగి సాగు సమయంలో ప్రభుత్వం నుంచి రూ.24కోట్ల 84లక్షలకు పైగా రైతుబంధు డబ్బులు అందుతోంది. వీరిలో వివిధ బ్యాంకుల్లో రుణాలు పొందుతున్న రైతులు దాదాపు 8వేలకుపైగా ఉంటారు. అందులో రెండు వేలకుపైగా రైతులు తమ రుణాలను రెన్యూవల్ చేసుకోకుండా ప్రభుత్వం అందించనున్న రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఆ 2 వేల మంది మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న 6 బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. అందులో మునుగోడులోని ఏపీజీవీబీ మేనేజర్ మాత్రమే రైతుల రైతుబంధు నగదు ఇవ్వకుండా వారి ఖాతాలను హోల్డ్‌లో పెట్టారు. మిగిలిన ఐదు బ్యాంకుల్లో మాత్రం ఇస్తున్నారు. ఒక్క బ్యాంకులో మాత్రమే ఖాతాలు హోల్డ్‌లో పెట్టడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకొని రైతుబంధు డబ్బులు అందేలా చూడాలని కోరుతున్నారు.

అధికారుల సూచనలు పాటిస్తున్నాం

ఓవర్ డ్యూ ఉన్న రైతుల ఖాతాలు ఫ్రీజ్ చేయాలని మా పైఅధికారులు సూచించారు. వారి సూచనల ప్రకారం అప్పు చెల్లించని రైతుల ఖాతాలు హోల్డ్ చేశాం. మూడేళ్లుగా రుణాలు రెన్యువల్ చేసుకొని రైతుల ఖాతాలు మాత్రమే హోల్డ్ చేశాం. ఆ రైతులు తమ రుణాను రెన్యూవల్ చేసుకుంటే వారి ఖాతాలో జమైన రైతుబంధు నగదు ఇస్తాం. మా బ్యాంకులో మూడేళ్లుగా రుణాలు చెల్లించని రైతులు 400 మంది ఉన్నారు. ఏడాదిపైగా చెల్లించనివారు 900 మంది ఉన్నారు.

–ఎస్.రాధాకృష్ణ, ఏపీజీవీబీ మేనేజర్, మునుగోడు బ్రాంచి

రుణమాఫీ అవుతుందని చెల్లించలేదు



నాకు మూడెకరాల భూమి ఉంది. గత ఎన్నికల ముందు నేను మునుగోడు ఏపీజీవీబీలో పంట రుణం తీసుకున్నా. ఎన్నికల సమయంలో రుణమాఫీ చేస్తామని చెప్పగా ఆ రుణం నేటికి కట్టలేదు. ఆ రుణం చెల్లిస్తేనే నా రైతుబంధు డబ్బులు ఇస్తానని బ్యాంక్ మేనేజర్ అంటున్నాడు. ఇతర బ్యాంకుల్లో అప్పు కట్టకున్నా.. ఎవ్వరి డబ్బులు ఆపడం లేదు.

– బొట్టు యాదమ్మ, సింగారం, మహిళా రైతు

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నల్లగొండ టౌన్ : రవాణా రంగంలో పనిచేస్తున్న ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేటు రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చినపాక లక్ష్మీనారాయణ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 3 నుంచి 11 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే రవాణా రంగ కార్మికుల సంఘర్షణ యాత్ర పోస్టర్‌ను సోమవారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో వారు ఆవిష్కరించి మాట్లాడారు. యాత్రలో కార్మికులు భారీసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వెంకన్న, యాదగిరి, మల్లారెడ్డి, శ్రీశైలం, లింగస్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

యాసంగి సాగు లక్ష ఎకరాల్లోపే..

- ఊపందుకోని వరినాట్లు
- రైతులను వేధిస్తున్న కూలీల కొరత



నల్లగొండ అగ్రికల్చర్ : యాసంగి సీజన్ ప్రారంభమై నెల పదిహేను రోజులు దాటినా.. సాగు అంతంతా మాత్రంగానే ఉంది. ఇప్పటి వరకు కేవలం లక్షలోపు ఎకరాల్లో మాత్రమే వరి, వేరుశనగ తదితర పంటలను సాగు చేశారు. ప్రధానంగా కూలీల కొరత రైతులను వేధిస్తోంది. నాగార్జునసాగర్ ఆయకట్టుకు సాగునీటి విడుదల కొనసాగుతున్నప్పటికీ అక్కడా వరినాట్లు పెద్దగా ఊపందుకోలేదు. నాన్ ఆయకట్టు ప్రాంతమైన ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు కింద యాసంగి పంటకు వారబంధీ పద్ధతిని నీటిని విడుదల చేస్తున్నారు. అక్కడ కూడా రైతులు నార్లు పోసుకుని నాట్లు వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ జనవరి చివరి నాటికి యాసంగి వరినాట్లు పూర్తయ్యే అవకాశం ఉంది.

యాసంగిలో సాగు ఇలా..

యాసంగి సీజన్‌లో వరి 4,71,250 ఎకరాల్లో, వేరుశనగ 38,245, మినుము 1,325, పెసర, ఇతర పంటలు కలిపి మొత్తం 5,15,815 ఎకరాల్లో సాగు కానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే ఇప్పటి వరకు వరి 88,300 ఎకరాల్లో, వేరుశనగ 8100, ఉలువలు 40, మినుము 35, మొక్కజొన్న 25, చెరుకు 100 ఎకరాల్లో రైతులు సాగు చేశారు.

నాట్లకు కూలీల కొరత..

వరినాట్లు వేసుకోవడానికి కూలీల కొరత రైతులను వేధిస్తోంది. జిల్లాలో వరినాటు యంత్రాలు అందుబాటులో ఉన్నప్పటికీ అనేక ప్రాంతాల్లో రైతులు కూలీలతోనే నాట్లు వేయించుకోవడానికి అలవాటు పడ్డారు. విత్తనాలు వెదజల్లే పద్ధతి వైపు కూడా మొగ్గు చూపడం లేదు. రైతులంతా కూలీల కోసం ఎదురుచూస్తుండడంతో సమయానికి నాట్లు వేయలేకపోతున్నారు. దీంతో రైతులు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను రప్పిస్తున్నారు. వారికి ఎకరానికి కూలిగా రూ.5500 నుంచి రూ.6 వేల వరకు చెల్లిస్తున్నారు. ఆటో చార్జీలు, మేస్త్రీ మామూలు అదనం. సమయానికి నాటు వేయించేందుకు అదనపు ఖర్చుకు సైతం రైతులు వెనుకాడడం లేదు.

నేడు సైలెన్స్ రీట్రీట్ సెంటర్ ప్రారంభం

- వర్చువల్ ద్వారా ప్రారంభించనున్న రాష్ట్రపతి
- హాజరుకానున్న గవర్నర్ తమిళిసై, మంత్రి జగదీశ్‌రెడ్డి



ప్రారంభానికి సిద్ధమైన సైలెన్స్ రీట్రీట్ సెంటర్

బీబీనగర్ : మండలంలోని మహాదేవ్‌పురం పరిధిలో గల అధ్యాత్మిక శాంతి కేంద్రమైన బ్రహ్మకుమారీస్ భవనంలో ఏర్పాటు చేసిన సైలెన్స్ రిట్రీట్ సెంటర్ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ కేంద్రాన్ని మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాజస్థాన్ నుంచి వర్చువల్ ద్వారా ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారని పేర్కొన్నారు. సాయంత్రం 4.30కి ఆమె మహాదేవపురం చేరుకోనున్నారు. గవర్నర్‌తో పాటు మంత్రి జగదీశ్‌రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు.

పంచాయతీలు.. అప్పులపాలు

- కార్మికుల వేతనాలు చెల్లించేందుకు కూడా అవస్థలు
- కలెక్టర్ నిధుల నుంచి ట్రాక్టర్ కిస్తీల చెల్లింపు
- ప్రస్తుతం రూ.13 కోట్ల వచ్చినా ఖర్చు చేసేందుకు ఆంక్షలు



నల్లగొండ : గ్రామ పంచాయతీలకు ఐదు నెలల నుంచి నిధులు రాక పోవడంతో సర్పంచ్‌లు అప్పులు చేసి పాలన సాగిస్తున్నారు. నవంబర్ నెలలో స్టేట్ ఫైనాన్స్ నిధుల రావడంతో పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు, కొంత విద్యుత్ బిల్లులకు చెల్లించారు. కానీ ట్రాక్టర్ కిస్తీలు చెల్లించకపోడంతో వాటిని బ్యాంకర్లు తీసుకుపోయే పరిస్థితి ఏర్పడడంతో కలెక్టర్ ఫండ్ నుంచి నిధులు అందించడంతో కొంత మేర ఊపిరి పీల్చుకున్నారు.

కేంద్రం నిధులు పంచాయతీలకే..

గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక నిధులు అందిస్తుంది. మూడు నెలలపాటు రాష్ట్రం, మరో మూడు నెలలు కేంద్రం నిధులు ఇస్తాయి. అయితే ఇటీవల కేంద్ర ప్రభుత్వం తాను ఇచ్చే నిధులు నేరుగా పంచాయితీలకు ఇస్తామని చెప్పింది. ఇందుకోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేయించింది. ఇటీవల ట్రయల్‌గా ప్రతి పంచాయతీకి రూ.10 వేల రూ.30 వేల జమ చేసింది. కానీ పూర్తిస్థాయిలో విడుదల చేయలేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ నెల నిధులు విడుదల చేయడంతో పంచాయతీలు కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లులు చెల్లించారు. ట్రాక్టర్ కిస్తీలకు ఇబ్బంది పడుతున్న పంచాయతీలకు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తన నిధుల నుంచి రూ.30 లక్షలు ఇచ్చారు.

కేంద్రం నిధులు 13 కోట్లు విడుదల...

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలకు రెండు రోజుల క్రితం కేంద్రం రూ.13 కోట్లు విడుదల చేసింది. ఇప్పటికే ట్రయల్ కింద రూ.3 కోట్లు ఆయా పంచాయతీల ఖాతాల్లో ఉన్నాయి. అయితే కేంద్రం ఇచ్చే నిధులను టైడ్, అన్‌టైడ్‌గా విభజించారు. దీంతో ఎలా బిల్లులు చెల్లించాలి అనే దానిపై స్పష్టత లేక నిధులు వచ్చినా సర్పంచ్‌లు ఏమీ చేయకుండా అధికారుల ఆదేశాలకోసం ఎదురుచూస్తున్నారు.

కేంద్రం నిధులను వాడుకోవచ్చు

కేంద్ర ఆర్థిక సంఘం నిధులు మొత్తం రూ.16 కోట్లు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను ఏ విధంగానైనా వాడుకోవచ్చు. కాని కేంద్రప్రభుత్వ నిధుల్లో 50 శాతం టైడ్, మరో 50 శాతం అన్‌టైడ్‌కు ఖర్చు చేయాలి. అన్‌టైడ్ నిధులు కేవలం తాగునీటి ఖర్చు పెట్టుకోవాలి. అందులో విద్యుత్ బిల్లులు కూడా తాగునీటికింది వస్తుంది. పంచాయతీలో ఎక్కువ శాతం పారిశుద్ధ్యం, తాగునీటికి సంబంధించిన పనులు ఉంటాయి కాబట్టి నిధులను ఇప్పటికే చేసిన పనులకు, ఇతర అన్ని అవసరాలకు వినియోగించుకోవచ్చు.

– విష్ణువర్ధన్‌రెడ్డి, డీపీఓ



రాజీవ్‌చౌక్ వద్ద నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అరెస్ట్ అప్రజాస్వామికం

మిర్యాలగూడ : ప్రజా సమస్యలపై పోరాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చిరుమర్రి కృష్ణయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి అరెస్ట్‌ను నిరసిస్తూ సోమవారం పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, అర్జున్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి మృతదేహం లభ్యం

గరిడేపల్లి: మిర్యాలగూడ పట్టణానికి చెందిన గుంటి శివరామకృష్ణ శుక్రవారం తన భార్యతో గొడవపడి నందిపాడు సమీపంలోని సాగర్ కాలువలో దూకగా, సోమవారం గరిడేపల్లి మండలంలోని పొనుగోడు రిజర్వాయర్‌లో అతడి మృతదేహం లభ్యమైంది. స్థానిక రైతులు రిజర్వాయర్‌లో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా.. శివ రామకృష్ణ తమ్ముడు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండల్‌రెడ్డి తెలిపాడు. మృతుడి భార్య కూడా శుక్రవారం గొడవ జరిగిన రోజే ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు.

'శ్రీని'లో అగ్నిప్రమాదం.. కెమిస్ట్‌కు గాయాలు

చౌటుప్పల్: పట్టణ శివారులోని శ్రీని ఫార్మాస్యూటికల్ కంపెనీలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయని ఎస్‌ఐ సైదులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం గజలాపురం గ్రామానికి చెందిన ఉగ్గిడి సాయికుమార్(25) శ్రీని పరిశ్రమలో కెమిస్ట్‌గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా శనివారం నైట్ డ్యూటీకి వెళ్లాడు. అర్ధ రాత్రి దాటిన తర్వాత రియాక్టర్ వద్ద వాల్వ్ తిప్పుతుండగా అధిక పీడనం ఏర్పడి మంటలు చెలరేగాయి. దీంతో సాయికుమార్‌కు మంటలు అంటుకొని గాయాలయ్యాయి. అతడిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గరిడేపల్లి: జీవితంపై విరక్తితో పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని గానుగుబండ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కొండల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గానుగుబండ గ్రామానికి చెందిన తాళ్ల శ్రీను(50) భార్య 12ఏళ్ల క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి అతడు మద్యానికి బానిస అయ్యాడు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీను జీవితంపై విరక్తి చెంది ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత చుట్టుపక్కల వారు గమనించి అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి తల్లి పున్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

దాడి కేసులో ఐదుగురు అరెస్టు

నకిరేకల్: ప్రేమ పెళ్లి చేసుకున్న యువకుడి ఇంటిపై దాడి చేసి అమ్మాయి తీసుకెళ్లిన కేసులో ఐదుగురిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌లోని బొడ్రాయి బజార్‌లో నివాసముంటున్న తాదూరి నవదీప్, శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామానికి చెందిన వరికుప్పల కావ్యను డిసెంబర్ 29న నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు క్షేత్రంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అమ్మాయి తండ్రి వరికుప్పల వెంకన్నతో పాటు మరికొంత మంది మరుసటి రోజు నవదీప్ ఇంటిపై దాడి చేసి అతడిని గాయపర్చి కావ్యను తమ వెంట తీసుకవెళ్లారు. ఈ మేరకు నవదీప్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అమ్మాయి తండ్రి వరికుప్పల వెంకన్నతో పాటు ఓర్సు యాదగిరి, వి. నరేష్, ఎస్. శ్రీకాంత్, షేక్ జహంగీర్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

వైకుంఠ వైభవం..

- యాదాద్రి ఆలయ ఉద్ఘాటన తర్వాత తొలిసారిగా వేడుక
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



స్వామి సేవలో మంత్రి జగదీశ్‌రెడ్డి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ విప్ సునీత



ఉత్తర రాజగోపురం వద్ద వైకుంఠ ద్వార దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహుడు సోమవారం భక్తులకు వైకుంఠనాథుడిగా దర్శనమిచ్చారు. యాదాద్రీశుడి ప్రధానాలయ ఉత్తర ద్వారం గుండా భక్త జనులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 6.30గంటలకు గరుడ వాహనంపై వైకుంఠ నాథుడిగా శ్రీనరసింహస్వామిని అలంకరించి అమ్మవారిని, ఆళ్వారాధులను అలంకార సేవలతో ప్రధానాలయం నుంచి ఉత్తర ద్వారం వద్దకు తీసుకువచ్చి పంచారాత్రా ఆగమశాస్త్ర ప్రకారం పూజలు నిర్వహించారు. ఉదయం 6.48గంటలకు నారసింహుడు ఉత్తర ద్వారం వద్ద వైకుంఠనాథుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు ఉదయం 3గంటలకు ఆలయం తెరచి సుప్రభాతం, ప్రాతఃకాల తిరువారధన, ధనుర్మాస తిరుప్పావై సేవా కాలం, బాలభోగం, ఆరగింపు, చాత్మురై వంటి పూజలు జరిపించి, 5.15గంటల నుంచి 6.30గంటల వరకు శ్రీస్వామిని గరుఢవాహనంపై పరవాసుదేవ అలంకారం (శ్రీలక్ష్మీనృసింహస్వామి) సేవలో ఊరేగిస్తూ 6.48గంటలకు ఉత్తర ద్వారం గుండా ద్వార భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సమయంలో ఆచార్యుల వేదమంత్రాలతో యాదాద్రి కొండ మార్మోగిపోయింది. భక్తులు యాదాద్రీశా.. జై లక్ష్మీనారసింహ అంటూ నినాదాలు చేశారు. అనంతరం తిరువీధుల్లో సేవను ఊరేగించారు.

పాతగుట్టలో...

యాదాద్రి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉత్తర ద్వారంలో నృసింహుడు వైకుంఠనాథుడిగా దర్శనమించారు. వేకువజామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు శ్రీ స్వామి అమ్మవార్లకు సుప్రభాతం, ఆరాధన చేపట్టారు. వైకుంఠనాథుడిగా శ్రీస్వామిని అలంకరించి గరుడవాహనంపై ప్రత్యేక సేవలో ఉత్తర ద్వారంకు తీసుకువచ్చారు. సరిగ్గా ఉదయం 6.48 గంటలకు భక్తులకు శ్రీస్వామివారు వైకుంఠనాథుడిగా దర్శనమిచ్చారు. అనంతరం వచ్చిన భక్తులకు క్యూలైన్ ద్వారా ముఖ మండపంలో భక్తులకు స్వామిని దర్శించుకునేందుకు అవకాశం కల్పించారు.



అధ్యయనోత్సవాల్లో భాగంగా సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు, పారాయణీకులు

అధ్యయనోత్సవాలకు శ్రీకారం...

యాదాద్రి ప్రధానాలయంలో అధ్యయనోత్సవాలకు ఆచార్యులు ద్రావిడ ప్రబంధ సేవా కాలం పారాయణీక స్వాములచే శ్రీకారం చుట్టారు. తొళక్కముతో అధ్యయనోత్సవాలను ప్రారంభించారు. శ్రీస్వామి వారిని విష్ణుమూర్తిగా అలంకారం చేసి మత్స్యావతార సేవలో ఆగమశాస్త్రానుసారంగా శ్రీ స్వామి వారిని పురప్పాట్ సేవగా ఊరేగింపు సేవ చేపట్టారు.

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యాలు



ఆలయ తూర్పు రాజగోపురం ముందు నృత్యం చేస్తున్న చిన్నారులు

యాదగిరిగుట్ట: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో సోమవారం సాయంత్రం శ్రీసాంస్కృతిక విశ్వకళా మండలి ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. యాదాద్రీశుడి చరిత్రను తెలిపే పాటలకు అనుగుణంగా చిన్నారులు చేసిన నృత్యాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో కూచిపూడి నాట్య గురువులు డాక్టర్ ఎస్.సి. కృష్ణకుమారి, డాక్టర్ మనోజ్ఞ, సంగీత విద్వాంసులు వెంకటచార్యులు, జ్యోతిర్మయి, విశ్వకళా మండలి వ్యవస్థాపకుడు రాంనర్సయ్య తదితరులున్నారు.

మట్టపల్లి క్షేత్రానికి భక్తజనం



మట్టపల్లి పురవీధుల్లో గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

మఠంపల్లి: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి భక్తులు తరలివచ్చారు.. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక అర్చనలు నిర్వహించగా, అనంతరం శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మీ సమేతం శ్రీలక్ష్మీనరసింహస్వామి వైకుంఠ (ఉత్తర) ద్వార దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారంలోనూ, అదేవిధంగా క్యూలైన్ల ద్వారా గర్భాలయంలోనూ దర్శించుకున్నారు. వైకుంఠ ద్వారం నుంచి గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్లను మట్టపల్లి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో లక్ష ఆరెపత్రి పూజను అర్చకులు ఘనంగా నిర్వహించారు. అంతేగాక హరికథలు, బుర్రకథ, పురాణ కాలక్షేపాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణా చార్యులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో భక్తుల కిటకిట



స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి దంపతులు, భక్తులు

రామగిరి(నల్లగొండ) : తెలంగాణలో రెండో భద్రాద్రిగా ప్రసిద్ధిగాంచిన నల్లగొండ పట్టణంలోని రామగిరిలో గల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం (రామాలయం) వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం భక్తులతో కిటకిటలాడింది. నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, భక్తులు స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చకిలం వేణుగోపాల్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు యాట జయప్రద, వేదాంతం శ్రీనివాసాచార్యులు, మిరియాల స్వామి, పాదం ప్రియాంక, హనుమంతు, కక్కిరేణి లక్ష్మీనారాయణ, ఈఓ జిల్లేపల్లి జయరామయ్య పాల్గొన్నారు.

సాగర్ ఎడమ కాల్వలో వ్యక్తి గల్లంతు



లక్ష్మణ్

మిర్యాలగూడ: వేములపల్లి మండలం రావులపెంట గ్రామ శివారులో సాగర్ ఎడమ కాల్వలో సోమవారం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామానికి చెందిన గొట్టిపర్తి లక్ష్మణ్(35) 20 సంవత్సరాలుగా నల్లగొండలో నివాసముంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఆటోలో సాగర్ ఎడమ కాల్వ మీదుగా సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపాడు గ్రామానికి వెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో రావులపెంట గ్రామ శివారులో కాల్వ కట్టపై బహిర్భూమికి వెళ్లి, కాల్వలో దిగగా ప్రమాదవశాత్తు అందులో జారిపడ్డాడు. స్థానికులు గమనించి కాపాడేందుకు ప్రయత్నించగా నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులకు వెంటనే అక్కడకు చేరకుని లక్ష్మణ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. లక్ష్మణ్ భార్య రెండేళ్ల క్రితమే చనిపోగా, ఒక కుమారుడు ఉన్నాడు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

- 8తులాల బంగారు ఆభరణాలు చోరీ

హుజూర్‌నగర్ (చింతలపాలెం): తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి 8తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన చింతలపాలెంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం గ్రామానికి చెందిన ఉస్తెల పెద్దవెంకటరెడ్డి ఉదయం 10గంటల సమయంలో ఇంటికి తాళం వేసి గ్రామంలోని తన తమ్ముడి మనవరాలి అన్నప్రాసన కార్యక్రమానికి వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండటం గమనించి లోపలికి వెళ్లి చూడగా, గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న సుమారు 8తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మద్యం మత్తులో యువకుల దాడి

- గోపలాయపల్లిలో విచారణ చేపట్టిన పోలీసులు



గోపలాయపల్లి గ్రామంలో విచారిస్తున్న సీఐ శివరాంరెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణ

నార్కట్‌పల్లి: మండలంలోని గోపలాయపల్లి గ్రామంలో ఏడుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి గోపలాయపల్లి గ్రామంలో కొందరు యువకులు మద్యం మత్తులో పలువురిపై దాడి చేశారు. దీంతో గ్రామానికి చెందిన దేశగాని పురుషోత్తం, శ్రవణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం సీఐ శివరాంరెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణ గ్రామంలో విచారణ చేపట్టి వివరాలు సేకరించారు. దాడి చేసింది గాలి వేణు, పోషలు, తేజ, వినయ్, మచ్చ వేణు, చక్రి, అరిగెల శివగా గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. యువకులు మద్యానికి బానిస కాకుండా కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సీఐ శివరాంరెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం



హిల్‌కాలనీ డౌన్‌లో రోడ్డు దిగి గట్టు పైకి ఎక్కి ఆగిన బస్సు

నాగార్జునసాగర్: ఆటోను తప్పించబోయిన ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కకు వెళ్లి ఆగిపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీ నుంచి పైలాన్ వెళ్తుండగా, ఇందిరమ్మ విగ్రహం దాటాక రోడ్డుపై లారీ ఆగి ఉంది. అదే సమయంలో ఎదురుగా ఆటో రావడంతో ఆటో తప్పించబోయిన బస్సు డ్రైవర్ బస్సును రోడ్డు పక్కకు తీసుకెళ్లడంతో అది గట్టు పైకి ఎక్కింది. ఏమాత్రం కొంత ముందుకు కదిలితే బస్సు రోడ్డుపై పడిపోయేదని ప్రయాణికులు తెలిపారు. ఈ ఘటన జరిగిన సమయంలో బస్సులో 60మంది ప్రయాణికులు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పోలీస్ ఈవెంట్స్‌లో 559మంది ఎంపిక

నల్లగొండ క్రైం: పోలీసు ఉద్యోగాల భర్తీలో భాగంగా పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఈవెంట్స్‌లో సోమవారం 559మంది ఎంపికయ్యారు. మొత్తం 1332మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 1159మంది హాజరయ్యారు. ఈవెంట్స్‌ను స్పెషల్ ఎస్పీ శబరీష్ పర్యవేక్షించారు.

యువకుడి దారుణ హత్య

- తలపై ఇనుప పైపుతో కొట్టి చంపిన నిందితుడు
- అసభ్య పదజాలం ఉపయోగించి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలపడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం
- తడకమళ్ల గ్రామంలో ఘటన



సుధాకర్ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: అసభ్య పదజాలం ఉపయోగించి న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పడంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి యువకుడి హత్యకు దారి తీసిన ఘటన మిర్యాలగూడ మండలంలోని తడకమళ్ల గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తడకమళ్ల గ్రామానికి చెందిన జంగాల నర్సయ్య, నర్సమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం. నర్సయ్య గతంలోనే చనిపోగా, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడి పెళ్లిళ్లు అయ్యాయి. చిన్న కుమారుడు జంగాల సుధాకర్ (28) సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పీవీసీ పైపుల కంపెనీలో పనిచేస్తూ తల్లికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. సుధాకర్ ఆదివారం రాత్రి 10గంటల సమయంలో తన స్నేహితులు ఎర్ర నాగరాజు, ఎర్ర భానుతో కలిసి తడకమళ్ల గ్రామ బస్టాండ్ వద్దకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలోనే తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన చిటికెల సోమయ్య కుమారుడు మల్సూర్ పాత పరిచయంతో సుధాకర్‌ను అడ్డగించి అసభ్య పదజాలం ఉపయోగించి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పాడు. సుధాకర్ కూడా అదే రీతిలో అసభ్య పదజాలం ఉపయోగించి మల్సూర్‌కు తిరిగి శుభాకాంక్షలు చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్యన మాటామాట పెరిగి వాగ్వాదం జరిగింది. అనంతరం సుధాకర్ తన స్నేహితులు నాగరాజు, భానుతో కలిసి నడుచుకుంటూ ఇంటి వైపు వెళ్తుండగా మద్యం మత్తులో ఉన్న మల్సూర్ వెనుక నుంచి వెళ్లి ఇనుప పైపుతో సుధాకర్ తలపై గట్టిగా కొట్టడంతో అతడు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఇది చూసిన సుధాకర్ స్నేహితులు ఒక్కసారిగా కేకలు వేయడంతో మల్సూర్ పరారయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న సుధాకర్ తల్లి ఘటనా స్థలం వద్దకు చేరుకుని స్థానికుల సహకారంతో 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే సుధాకర్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తల్లి నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ..

హత్య జరిగిన విషయం తెలుసుకున్న మిర్యాలగూడ డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐ సత్యనారాయణ తడకమళ్ల గ్రామానికి వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడి వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముందు జాగ్రత్తగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తడకమళ్లలో వాడపల్లి ఎస్‌ఐ రవికుమార్, , తక్కెళ్లపాడులో మాడుగులపల్లి ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయించారు. నిందితుడు మల్సూర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

మాల మహానాడును బలోపేతం చేస్తాం

- సంఘం రాష్ట్ర కార్యదర్శి పిడతల శ్రీనివాస్

కోదాడ అర్బన్: తెలంగాణలో మాల మహానాడును మరింత బలోపేతం చేస్తామని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పిడతల శ్రీనివాస్ అన్నారు. సోమవారం కోదాడలో ఏర్పాటు చేసి మాలమహానాడు ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పట్టణ మాల మహానాడు కమిటీ అధ్యక్షుడిగా పిడతల శంకర్‌రావును నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లచ్చిమల్ల రామ్మోహన్‌రావు, అంబేద్కర్ మాలమిత్ర అసోసియేషన్ అధ్యక్షుడు మున్సిపల్ డీఈ లచ్చిమల్ల పిచ్చయ్య, వాస్తు రేఖ నాగేశ్వరరావు, హనుమంతరావు, పాలడుగు నాగరాజు, అంబేద్కర్ యూత్ సభ్యులు లచ్చిమల్ల అంజి, ప్రవీణ్, ఉపేందర్, వంశీ, శివ, జాన్, పుల్లయ్య, నాగార్జున, కిరణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌రావుకు నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కోదాడ అర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతలు చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ సూర్యాపేట జిల్లా ఉపాధ్యకుడు పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎన్. నాగేశ్వర్‌రావు, పౌరస్పందన వేదిక రాష్ట ఉపాధ్యక్షురాలు కేపీ. మంగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్‌లో ప్రభుత్వమే అల్పాహారం ఏర్పాటు చేయాలన్నారు. మన ఊరు- మన బడి నిధులు మంజూరు చేయాలన్నారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆడిట్ కమిటీ సభ్యులు జనార్దన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, కృష్ణయ్య, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే అవార్డుకు పోతిరెడ్డిపల్లి సర్పంచ్

ఆత్మకూరు(ఎం): సావిత్రిబాయి పూలే రాష్ట్రస్థాయి అవార్డుకు ఆత్మకూరు(ఎం) మండలం పోతిరెడ్డిపల్లి సర్పంచ్ గనగాని మాధవి ఎంపికయ్యారు. గ్రామస్థాయిలో చేపడుతున్న అభివృద్ధి మరియు సామాజిక సేవలకు గుర్తింపుగా ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన పది మందిలో పోతిరెడ్డిపల్లి సర్పంచ్ ఒకరు. సావిత్రిబాయి పూలే 192వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 3వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అవార్డు ప్రదానం చేయనున్నారు.

ప్రజా దర్బార్‌తో సమస్యలు పరిష్కారం

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

ఆలేరు రూరల్: ప్రజా దర్బార్ ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తోందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నాలుగు చక్రాల వాహనాలు కలిగిన ఉన్నారనే కారణంగా తమకు ఆసరా పింఛన్ నిలిపివేశారని పలువురు ప్రజా దర్బార్ దృష్టి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఈ సమస్యలను డీఆర్‌డీఓ ఉపేందర్ రెడ్డికి వివరించగా విచారణ జరిపారని, నియోజకవర్గ వ్యాప్తంగా 159 మంది (గతంలో రిజక్టు అయినవారు) అర్హులుగా తేల్చారని తెలిపారు. దీంతో వారిందరికీ నాలుగు నెలలుగా నిలిచిపోయిన పింఛన్ మొత్తం రూ.13,82,496 వారివారి బ్యాంక్ ఖాతాల్లో సోమవారం జమైందని పేర్కొన్నారు.



నల్లగొండ కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలుపుతున్న డీపీఓ విష్ణువర్ధన్



కలెక్టర్‌కు మొక్క అందజేసి శుభాకాంక్షలు చెబుతున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి



రెవెన్యూ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి